# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-06-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1) మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక సమతుల్యతకు యోగా దోహదపడుతుందని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**

**2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

**3. రాష్ట్రంలో అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించనున్నట్లు మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.**

**4. దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2026 పునః పరీక్ష మరికాసేపట్లో జరగనుంది.**

==========================

మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక సమతుల్యతకు యోగా దోహదపడుతుందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ లోక్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, గత 12 ఏళ్లుగా 'వికాస్ భీ, విశ్వాస్ భీ' అనే మంత్రంతో సాంస్కృతిక పునరుజ్జీవనంలో నూతన అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. యోగా కేవలం వ్యాయామం కాదని, అది ఒక జీవన విధానమని గవర్నర్ పేర్కొన్నారు.

-------------------------

పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూడెంలో ఘనంగా నిర్వహించిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల పాలన విజయోత్సవ సభలో కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో "డబుల్ ఇంజిన్ సర్కార్" ద్వారా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తూ అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు చేరవేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కేంద్ర మంత్రి వివరించారు.

-------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 12వ అంతర్జాతీయ యోగా

దినోత్సవ వేడుకలు ఈ రోజు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలో డచ్ భవన్ వద్ద జరిగిన కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డితో కలిసి ప్రారంభించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించిన సూర్య నమస్కారాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి పాల్గొన్నారు. అలాగే దక్షిణ కోస్తా రైల్వే విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియాతో పాటు రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొని యోగా ప్రాధాన్యతను వివరించారు.

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా "యోగాంధ్ర" కార్యక్రమాలు జరిగాయి.. కృష్ణా జిల్లా ఉయ్యూరులో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని కలెక్టర్ డీకే బాలాజీ, స్థానిక శాసనసభ్యులు బోడే ప్రసాద్ ప్రారంభించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, పాల్గొని యోగా వల్ల ఆరోగ్యం, ఏకాగ్రత, ఉత్పాదకత పెరుగుతాయని తెలిపారు.

నంద్యాల జిల్లా బనగానపల్లెలో జరిగిన కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొని ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. నెల్లూరులోని గాంధీ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి రిజిస్ట్రీ ఏర్పాటు, వైద్యులకు ప్రత్యేక శిక్షణ కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలతో ఈ ఏడాది చివరి నాటికి కొత్త పాలసీని అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో మూడు రిఫరల్ కేంద్రాలు, ఒక అత్యుత్తమ సేవా కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇందుకోసం విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, కాకినాడ బోధనాసుపత్రులను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అరుదైన వ్యాధుల జాతీయ విధానం కింద కేంద్ర ప్రభుత్వం 63 రకాల అరుదైన వ్యాధులను గుర్తించిందని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాల ఫలితాలను కూడా అధ్యయనం చేసి రాష్ట్రానికి అనువైన విధానాన్ని రూపొందిస్తామని ఆయన వెల్లడించారు.

---------------------------

దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2026 పునః పరీక్ష మరికాసేపట్లో జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 15 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా 22 లక్షల 79 వేల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. 551 నగరాలతో పాటు విదేశాల్లోని 14 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అవకతవకలకు తావులేకుండా సీసీటీవీ నిఘా, జీపీఎస్ ట్రాకింగ్, ఆధార్ బయోమెట్రిక్ ధ్రువీకరణ

వంటి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాల తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఉండదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ –ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ట్రాఫిక్ వంటి కారణాలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించింది.

---------------------------

మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ఈగల్ విభాగం చేపడుతున్న చర్యల్లో భాగంగా కర్నూలు జిల్లా కే. నాగులాపురంలోని కళాశాలలో "డ్రగ్స్ వద్దు బ్రో" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ అధికారులు విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈగల్ విభాగం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో భాగంగా నిర్వహించే పోలీస్ ధృవీకరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా, నిర్వహించడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్‌కు వరుసగా రెండో ఏడాది జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పాస్‌పోర్ట్ సేవా దివస్–2026 సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన "ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారుల సదస్సు"లో ఆంధ్రప్రదేశ్ పోలీస్‌కు 'బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు' ప్రదానం చేశారు. రాష్ట్ర పోలీస్ తరఫున ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ ఎ. రమాదేవి ఈ పురస్కారాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చేతుల మీదుగా అందుకున్నారు.

---------------------------

తూర్పు విదర్భ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల మీదుగా ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాల్లో ఈ రోజు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ..

..వాయిస్..25 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 26వ తేదీ వరకు పంపవచ్చు.

=====================